క్లుప్తంగా

శ్రీమహాలక్ష్మికి సువర్ణ పుష్పార్చన



ప్రత్యేకాలంకరణలో శ్రీమహాలక్ష్మి అమ్మవారు

విజయనగరం టౌన్: అష్టలక్ష్మీ సమేత ఐశ్వర్య వేంకటేశ్వరాలయం శ్రీక్షేత్రంలో శ్రీమహాలక్ష్మి అమ్మవారికి సువర్ణ పుష్పార్చన సేవ ఆదివారం నిర్వహించారు. ఆలయ అర్చకులు చామర్తి రమేష్ఆచార్యులు, అంపోలు లక్ష్మీనరసింహాచార్యులు అమ్మవారికి ప్రత్యేకాభిషేకాలు, విశిష్ట పూజాధికాలు చేశారు. మంగళస్వరూపిణి, నిత్యసౌభాగ్యవతి అయిన అమ్మవారికి పసుపు, కుంకుమలు సమర్పించారు.

వరప్రసాద్‌కు నవరత్న పురస్కారం



నవరత్న పురస్కారం అందుకుంటున్న గెద్ద వరప్రసాద్

విజయనగరం టౌన్: జిల్లాకు చెందిన ప్రముఖ రంగస్థల, సినీ నటుడు గెద్ద వరప్రసాద్‌కు తిరుపతి మహతి కళాక్షేత్రంలో నవరత్న పురస్కారం అందజేసి, సత్కరించారు. సుబ్బరాజు నాట్య కళాపరిషత్ 63వ వార్షికోత్సవం పురస్కరించుకుని, 45 ఏళ్లుగా నాటక రంగాభివృద్ధికి ఆయన చేసిన కృషికి గాను ఆయనకు ఈ అవార్డు అందజేసినట్లు ఆయన తెలిపారు. ఈ మేరకు జిల్లాకు చెందిన కళాకారులు ఆయనకు అభినందనలు చెబుతున్నారు.

పంపిణీకి 'చెత్త' బకెట్లు సిద్ధం



ఎంపీడీవో కార్యాలయ ఆవరణకు చేరుకున్న బకెట్లు

పూసపాటిరేగ: స్థానిక మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో పంపిణీకి సిద్ధంగా చెత్త సేకరణ బకెట్లు ఉన్నాయి. పరిసరాల పరిశుభ్రతే లక్ష్యంగా ప్రతి ఇంటి నుంచి తడి, పొడి చెత్త సేకరణ కోసం వీటిని పంచాయతీలకు అందించనున్నారు. అనంతరం సర్పంచ్ ఆధ్వర్యంలో ప్రతి ఇంటికీ వీటిని అందివ్వనున్నారని ఈవోపీఆర్‌డీ జ్ఞానేశ్వరరావు తెలిపారు.

ఉచిత వైద్యసేవలు వినియోగించుకోవాలి

గంట్యాడ: గ్రామాల్లో నిర్వహించే వైద్యశిబిరాల్లో అందించే ఉచిత వైద్య సేవలను వినియోగించుకోవాలని పెదమధుపాడ సర్పంచ్ కిలపర్తి శ్రీరామ్మూర్తి సూచించారు. మండలంలోని పెదమధుపాడలో ఎస్.కోటకు చెందిన కొలపర్తి మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రి వారు నిర్వహించిన ఉచిత వైద్యశిబిరాన్ని ఆదివారం ఆయన ప్రారంభించారు. వైద్యులు నీరజ్‌కుమార్, తదితరులు రోగులను పరీక్షించి అవసరమైన వారికి మందులు అందజేశారు.

ఉభాలు ప్రారంభం

దత్తిరాజేరు: వరుణుడు కరుణించడంతో రెండు రోజులుగా మండల పరిధిలో ఉభాలు జరుగుతున్నాయి. మండలంలోని కోమటిపల్లి, చెరుకుపల్లి, మరడాం, పెదమానాపురం, ఇంగిలాపల్లి, పాసలవలస, వంగర, దాసరిపేట, తదితర గ్రామాల్లో నాట్లు వేస్తున్నారు. మరికొన్ని గ్రామాల్లో నాట్లు వేసేందుకు మడులను సిద్ధం చేశారు.

ఎండిపోతున్న వరి నారు



గుర్లలో ఎండిపోతున్న వరి నారు

గుర్ల: వర్షాలు పడకపోవడంతో వరి నారు ఎండిపోతోంది. వరుణుడు కరుణించకపోవడంతో పాటు గెడ్డలు, వాగుల్లో కూడా నీరు లేకపోవడంతో నారుకు నీటి తడులు అందించలేక రైతులు తలలు పట్టుకుంటున్నారు. మరో వారం రోజుల్లో వర్షాలు పడకపోతే ఖరీఫ్ సీజన్‌పై ఆశలు వదులుకోవాల్సిందేనని అన్నదాతలు చెబుతున్నారు. మండలంలోని గుర్ల, కలవచర్ల, గోషాడ, పాలవలస, కోటగండ్రేడు, తెట్టంగి, పల్లిగండ్రేడు, తదితర గ్రామాల్లో పంట భూములు దాదాపు బీడు భూములుగా మారిపోయాయి.

మోతాదు మించితే మొదటికే మోసం!

- ఎరువుల వినియోగంలో జాగ్రత్తలు తప్పనిసరి
- అవసరం మేర మాత్రమే వాడుకోవాలి
- అధికంగా వినియోగిస్తే అనర్థమే
- రైతులకు అవగాహన అవసరం



మొయిదలో ఎరువుల వినియోగంపై రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏఓ శ్రీలక్ష్మి(ఫైల్)

నెల్లిమర్ల రూరల్: ఆరుగాలం కష్టపడి పంటలు సాగు చేస్తున్న రైతన్నలు అధిక దిగుబడుల కోసం అవసరానికి మించి ఎరువులు, పురుగుమందులు వాడి కోరి నష్టాలను కొని తెచ్చుకుంటున్నారు. మోతాదుకు మించి ఎరువులు వాడితే నష్టమే తప్ప ప్రయోజనమేమీ ఉండదని వ్యవసాయ శాస్త్రవేత్తలు, అధికారులు సూచిస్తున్నారు. వ్యవసాయంలో ఎరువుల వినియోగంపై అన్నదాతలు అవగాహన తప్పనిసరిగా కలిగి ఉండాలని చెబుతున్నారు. ఓ పద్ధతి ప్రకారం ఎరువులు వినియోగిస్తే మంచి పంట దిగుబడితో పాటు భూసారం కూడా పెంచుకోవచ్చని సలహా ఇస్తున్నారు. ప్రతి రైతు సాగులో రసాయన ఎరువుల వినియోగం తగ్గించి, సేంద్రియ ఎరువుల వినియోగం పెంచాలి. ఇదే ప్రధాన ఉద్దేశంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రకృతి సేద్యాన్ని ప్రోత్సహిస్తుండడం విశేషం. శాస్త్రవేత్తలు, వ్యవసాయాధికారులు కూడా గ్రామీణ ప్రాంతాల్లో పర్యటిస్తూ రైతులను అప్రమత్తం చేస్తున్నారు.

ఖర్చు తప్ప దిగుబడి ఉండదు..

పంటకు కావాల్సిన మోతాదు ఎరువుల కన్నా ఎక్కువ వినియోగిస్తే ఖర్చు తప్ప దిగుబడి అంతగా ఉండదని వ్యవసాయ నిపుణులు పేర్కొంటున్నారు. ఖర్చులు విపరీతంగా పెరిగి ఆర్థికభారం ఎదుర్కోవాల్సి ఉంటుందని ఏరువాక కేంద్రం శాస్త్రవేత్తలు చెబుతున్నారు. జిల్లాలో 80 వేల హెక్టార్లలో ప్రస్తుతం వరి సాగు జరుగుతోంది. దీనిలో 8 వేల ఎకరాల్లో ప్రకృతి వ్యవసాయం చేస్తున్నారు. మరికొన్ని హెక్టార్ల పొలాల్లో వివిధ రకాల కషాయాలను ఎరువులుగా వినియోగిస్తున్నారని వ్యవసాయ శాఖ గణాంకాల ద్వారా తెలియవస్తోంది.



నెల్లిమర్లలో ఎరువుల నిల్వలను పరిశీలిస్తున్న అధికారులు(ఫైల్)

భూసారం దెబ్బతింటుంది..

సాధారణంగా పంటకు నత్రజని, భాస్వరం, పొటాష్ నాలుగు లేదా రెండు సార్లు వేర్వేరుగా వాడుతారు. కానీ చాలామంది రైతులు నత్రజనిని 8 నుంచి 12 సార్లు వేర్వేరుగా వాడుతున్నారు. దీని వల్ల భూసారం బాగా దెబ్బతింటోంది. వరినాట్లు సమయంలో 50 కిలోల డీఏపీకి 25 కిలోల యూరియా, 15 కిలోల పొటాష్‌ను కలపాలి. నాట్లు వేసిన 30 రోజుల తర్వాత రెండో విడత కింద ఎకరానికి 25 కిలోల యూరియాను వాడాలి. లేకుంటే పావు లీటరు నానో యూరియాను పిచికారీ చేయాలి. పంట వేసిన 45 రోజుల తర్వాత మరోసారి 25 కిలోల యూరియాతో 15 కిలోల పొటాష్‌ను కలిపి వాడాలి. లేదంటే అర లీటరు నానో యూరియాను వాడవచ్చు.

రైతులకు అవగాహన కల్పిస్తున్నాం..

రసాయన ఎరువులు అంతగా వినియోగం ఉండని ప్రకృతి సేద్యం వైపు రైతులను ప్రోత్సహిస్తున్నాం. ప్రతి గ్రామంలోని రైతులతో సమావేశాలు నిర్వహించి, అవగాహన కల్పిస్తున్నాం. ఎరువులు ఎక్కువగా వాడకుండా ఉండేలా అప్రమత్తం చేస్తున్నాం. సాగులో చేపట్టాల్సిన చర్యలను వివరిస్తున్నాం.

–శ్రీలక్ష్మి, మండల వ్యవసాయాధికారిణి, నెల్లిమర్ల

శిథిలావస్థలో పీఏసీఎస్ భవనం



పూసపాటిరేగలోని పాత పీఏసీఎస్(ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం) భవనం పూర్తిగా శిథిలావస్థకు చేరుకుంది. దాదాపు 40 ఏళ్ల క్రితం నాటి నిర్మాణం కావడంతో ఇప్పుడు అది ఏ క్షణానైనా కూలిపోయే దశకు చేరుకుంది. ఈ నేపథ్యంలో కొత్త భవనం మంజూరు చేయాలని, ఆ భవనం స్థానంలో కొత్త భవన నిర్మాణం చేయాలని రైతులు విజ్ఞప్తులు చేస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. కనీసం ఎవరికీ ఎటువంటి ప్రమాదం జరగకుండా శిథిలావస్థలోని ఆ భవనాన్ని కూలదోయాలని పలువురు కోరుతున్నారు.

–పూసపాటిరేగ

ఆకట్టుకున్న సాంస్కృతిక ప్రదర్శనలు



శ్రావణమాసం పురస్కరించుకుని, విజయనగరం మండలం, దుప్పాడలోని అష్టలక్ష్మీ సమేత ఐశ్వర్య వేంకటేశ్వరస్వామి ఆలయ ఆవరణలో ఆదివారం నిర్వహించిన సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. సంప్రదాయ, జానపద నృత్యాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. అనంతరం నృత్య పోటీల్లో విశేష ప్రతిభ కనబరిచిన వారికి శ్రీక్షేత్రం నిర్వాహకులు దుర్గా ఉమాబాలాజీ చేతులమీదుగా బహుమతులు అందజేశారు.

–విజయనగరం టౌన్

హైవేలో అంధకారం



భోగాపురం జాతీయ రహదారి(హైవే)లో అంధకారం నెలకొంది. ఫ్లైఓవర్ దగ్గరున్న విద్యుత్ దీపాలు రాత్రిపూట వెలగకపోవడంతో చీకటి అలుముకుంటోందని వాహనదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రధాన కూడలి అయిన హనుమాన్ జంక్షన్ ఫ్లైఓవర్ దగ్గర తరచూ ఇదే పరిస్థితి నెలకొనడంతో ఏదైనా ప్రమాదం జరుగుతుందేమోనని భయపడుతున్నామని వాహనదారులు వాపోతున్నారు. తక్షణమే హైవే అధికారులు స్పందించి, విద్యుత్ బల్బులు వెలిగేలా చూడాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

–భోగాపురం

పోరాటయోధుడు దాసరి



కామ్రేడ్ దాసరి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న సీపీఐ నాయకులు, కార్యకర్తలు

విజయనగరం గంటస్తంభం: సీపీఐ అగ్రనేత, కామ్రేడ్ దాసరి నాగభూషణరావు వర్ధంతి నగరంలోని డీఎన్ఆర్ అమర్‌భవన్‌లో ఆదివారం నిర్వహించారు. కార్యక్రమానికి హాజరైన సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి బుగత అశోక్ తదితరులు దాసరి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన సేవలను వక్తలు కొనియాడారు. ప్రజాపోరాట యోధుల దేహాలకు మరణం ఉంటుంది గానీ వారి ఆశయాలకు ఉండదన్నారు. గిరిజన హక్కుల పరిరక్షణకై దాసరి చేసిన పోరాటం స్ఫూర్తిదాయకమన్నారు. సాలూరు ప్రాంతంలో కొన్ని వందల ఎకరాల ప్రభుత్వ భూమిని పేదలకు ఇప్పించారని గుర్తు చేశారు. సీపీఐ జిల్లా కార్యాలయ స్థలం, భవన నిర్మాణానికి కృషి చేశారని, అందుకే సీపీఐ జిల్లా కార్యాలయానికి అమర జీవి కామ్రేడ్ దాసరి నాగభూషణరావు అమర్ భవన్ పేరు పెట్టడం జరిగిందన్నారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి ఒమ్మి రమణ, జిల్లా సహాయ కార్యదర్శి అలమండ ఆనందరావు, జిల్లా కార్యవర్గ సభ్యులు ఎస్.రంగరాజు, రమణమ్మ, అప్పారావు, జగన్నాథం తదితరులు పాల్గొన్నారు.

పంద్రాగస్టు వేడుకలను విజయవంతం చేయండి

విజయనగరం టౌన్: స్థానిక అంబటి సత్రం జంక్షన్‌లోని యేసు ప్రేమాలయంలో ఈ నెల 15వ తేదీన నిర్వహించనున్న స్వాతంత్ర్య దినోత్సవాలు(పంద్రాగస్టు వేడుకలు)ను విజయవంతం చేయాలని పాస్టర్ అలజంగి రవికుమార్ కోరారు. ఇదే విషయమై ఆ చర్చిలో మతవిశ్వాసకులతో ఆదివారం సమావేశమై, మాట్లాడారు. కార్యక్రమంలో భాగంగా తొలుత యువతకు పాటల పోటీలతో పాటు క్విజ్ పోటీలు నిర్వహించనున్నామన్నారు. ఉత్తరాంధ్ర జిల్లాల నుంచి యువతను పోటీలకు ఆహ్వానిస్తున్నామన్నారు. ఆగస్టు 15న జరిగే వేడుకల్లో ఈ పోటీల్లో విజేతలుగా నిలిచే వారికి బహుమతులు అందజేయనున్నామన్నారు.

రిటైర్డ్ టీచర్ ఇంట్లో చోరీ

విజయనగరం క్రైమ్: నగరంలోని జొన్నగుడ్డిలో ఉంటున్న రిటైర్డ్ టీచర్ గోక రవికుమార్ ఇంట్లో చోరీ జరిగింది. ఈ మేరకు వన్ టౌన్ పోలీసులకు రవికుమార్ ఇచ్చిన ఫిర్యాదుపై క్రైమ్ ఎస్సై సురేంద్ర నాయుడు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. రవికుమార్‌కు ఇద్దరు కూతుళ్లు, ఒక కొడుకు. రవికుమార్ రూ.2 లక్షల 60 వేల విలువగల 13 బంగారు వస్తువులను తన బీరువాలో పెట్టగా శ్రావణ శుక్రవారం నిమిత్తం పూజ కోసం బీరువా తెరిచి చూస్తే ఆభరణాలు కనిపించలేదని ఫిర్యాదు చేసినట్లు ఎస్సై తెలిపారు. ఆయన పెద్ద కూతుర్ని వైజాగ్, చిన్న కూతుర్ని సిగడాం ఇచ్చి వివాహం చేశారు. తనకు చిన్న అల్లుడిపైనే అనుమానం ఉందని బాధితుడు ఇచ్చిన ఫిర్యాదుతో దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై వివరించారు.

పెనుమత్స సాంబశివరాజుకు ఘనంగా నివాళులు



పెనుమత్స సాంబశివరాజు స్మృతివనం వద్ద నివాళులర్పిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

నెల్లిమర్ల రూరల్: దివంగత మాజీ మంత్రి పెనుమత్స సాంబశివరాజు వర్ధంతి మండలంలోని మొయిద గ్రామంలో ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా పలువురు వైఎస్సార్ సీపీ నాయకులు ఆ గ్రామంలోని సాంబశివరాజు స్మృతివనాన్ని సందర్శించి, ఆయన సమాధి వద్ద ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఆయన మంత్రిగా రాష్ట్రానికి చేసిన సేవలు గుర్తు చేసుకున్నారు. ఆయన సుదీర్ఘ రాజకీయ జీవితంలో ఎన్నో ఉన్నత పదవులు అధిరోహించినా గర్వం లేని సాధారణ జీవితాన్నే గడిపారని కొనియాడారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ ఎస్సీ సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి రేగాన శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

కొటియా సరిహద్దు సమస్యను పరిష్కరించాలి




మాట్లాడుతున్న లోక్‌సత్తా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు భీశెట్టి బాబ్జీ

విజయనగరం గంటస్తంభం: ఆంధ్రా–ఒడిశా వివాదాస్పద సరిహద్దు ప్రాంతమైన కొటియా సమస్యను పరిష్కరించాలని లోక్‌సత్తా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు భీశెట్టి బాబ్జీ డిమాండ్ చేశారు. ఇదే విషయమై ఆయన జిల్లా కేంద్రంలోని ఆ పార్టీ కార్యాలయంలో ఆదివారం విలేకరుల సమావేశం నిర్వహించి, మాట్లాడారు. ఉత్తరాంధ్ర నుంచి రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ మంత్రిగా గుమ్మడి సంధ్యారాణి ఉన్నా ఇక్కడ నెలకొన్న గిరిజన సమస్యల పరిష్కారంపై దృష్టి సారించకపోవడం విచారకరమన్నారు. ప్రపంచ ఆదివాసీ దినోత్సవం సందర్భంగా సీఎం చంద్రబాబు కొటియా గ్రామాల సమస్యలపై స్పందిస్తారని అంతా ఎదురుచూశారని అయినా ఆయన నోటి నుంచి ఎటువంటి ప్రకటన రాలేదన్నారు. అదే ఒడిశా డిప్యూటీ సీఎం, మహిళా శిశు సంక్షేమ శాఖ, పర్యాటక రంగ అభివృద్ధి శాఖ మంత్రి పార్వతి పరిఢ, ఒడిశా అధికారులు కొటియా ప్రాంతంలో పర్యటించారని, ఇక్కడి వారెందుకు పర్యటించడం లేదని ప్రశ్నించారు. ఇరు రాష్ట్రాలు ఆ ప్రాంతంపై హక్కు కోసం పోరాడుతున్నప్పుడు ఒక్క ఒడిశానే పైచేయి సాధించి, అక్కడి విలువైన ఖనిజ సంపదను దోచుకుంటుంటే చూస్తూ ఊరుకోవడం దుర్మార్గమన్నారు. ఎన్‌డీఏ ప్రభుత్వంలో కూటమి భాగస్వామిగా ఉన్నారని, అక్కడ కూడా బీజేపీ ప్రభుత్వం ఉన్నందున ఇప్పుడే కొటియా సమస్య పరిష్కారానికి మార్గం సుగమమయ్యే అవకాశాలు ఎక్కువగా ఉంటాయన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి, ఒడిశా ప్రభుత్వంతో మాట్లాడాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందన్నారు.

యథేచ్ఛగా ఆక్రమణలు..

- రహదారులపైనే దుకాణాలు
- నో పార్కింగ్ చోటే వాహనాల నిలుపుదల
- గజపతినగరం నియోజకవర్గ కేంద్రంలో ట్రాఫిక్‌తో ఇక్కట్లు



గణేష్ కోవెల రోడ్డులో ఆక్రమణలు

గజపతినగరం రూరల్: నియోజకవర్గ కేంద్రమైన గజపతినగరం పట్టణ కేంద్రంలో ఎటు చూసినా రహదారులపై ఆక్రమణలు కనిపిస్తున్నాయి. ఏ రోడ్డు చూసినా దుకాణాలు, తోపుడుబళ్లతో కుచించుకుపోతున్నాయి. దీనికి తోడు వాహనాలను ఎక్కడికక్కడే నిలిపివేస్తుండడంతో నగరవాసులకు ఇబ్బందిగా మారుతోంది. రోడ్లపై అడుగడుగునా బడ్డీ కొట్లు వెలియడంతో వాహన రాకపోకలకు అంతరాయం కలుగుతోంది. దీంతో ఎంతో వెడల్పుగా ఉండాల్సిన రోడ్లు కుచించుకుపోయి ఇరుకుగా మారుతున్నాయి. ఆక్రమణల కారణంగా ఉదయం, సాయంత్రం వేళల్లో నిత్యం ట్రాఫిక్ స్తంభించిపోతోంది. ప్రతిరోజూ ఉదయం, సాయంత్రం రోడ్లు రద్దీగా మారుతున్నాయి. అదే సమయంలో నిత్యం ఉద్యోగులు, విద్యార్థులు వివిధ పనులకు వెళ్లేవారు రోడ్డుపైకి రావడంతో తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు.

అడుగడుగునా తోపుడు బళ్లు..

నియోజకవర్గ కేంద్రంలోని నాలుగు రోడ్ల కూడలి నుంచి ఎటువైపు చూసినా రోడ్లపైన తోపుడు బళ్లు, బడ్డీకొట్లు, అల్పాహార దుకాణాలు వెలిశాయి. వీటి వల్ల కొనుగోలుదారులు తమ వాహనాలను రోడ్డుపైనే నిలిపేస్తున్నారు. దీంతో ట్రాఫిక్ స్తంభించిపోయి ప్రజలు నరకయాతన అనుభవిస్తున్నారు.

ఎక్కడెక్కడ..

నగరంలో ఎస్‌బీఐ బ్యాంక్ కూడలి.. రిజిస్ట్రార్ కార్యాలయం ప్రాంతం.. మెంటాడ వెళ్లే రహదారి.. దేవీ స్వీట్‌షాపు నుంచి పాత ఎంపీడీఓ కార్యాలయం రహదారి.. పోలీస్‌స్టేషన్ నుంచి వంద పడకల ఆస్పత్రి చివరి వరకు రోడ్డుకిరువైపులా ఇష్టారీతిలో వాహనాలను పార్కింగ్ చేస్తున్నారు. అలాగే తోపుడు బళ్లు ఎక్కడికక్కడ పెట్టేస్తుండడంతో ఏ రోడ్డు చూసినా రద్దీగా కనిపిస్తోంది.

పార్కింగ్‌కు చోటేదీ..?

నియోజకవర్గ కేంద్రంలోని రోడ్లపై ఉన్న పలు షాపింగ్ మాల్స్‌కు వాహనాల పార్కింగ్ సౌకర్యం లేక రోడ్లమీద ఇష్టారీతిలో నిలుపుదల చేసేస్తున్నారు. దీంతో ప్రధాన జాతీయ రహదారి అంతా ఇరుకుగా మారి ప్రజలకు ఇబ్బందిగా మారుతోంది. ఇటీవల రహదారుల విస్తరణ జరిగినప్పటికీ రోడ్డుపైనే వాహనాల పార్కింగ్‌తో మళ్లీ రోడ్లు ఇరుకుగా మారాయి.



మెంటాడ రోడ్డులో ఇదీ పరిస్థితి..



సీసీ కాలువపై నిర్మాణాలు

స్పెషల్ డ్రైవ్ చేపడుతున్నాం..

ప్రతిరోజూ స్పెషల్ డ్రైవ్ చేపట్టి అనధికార వాహనాలు, తోపుడు బళ్లను గుర్తించి తీయిస్తున్నాం. అలాగే పంచాయతీల నుంచి సంబంధిత అధికారులు స్పందించి అనధికార నిర్మాణాలపై దృష్టి సారిస్తే పరిస్థితి మెరుగుపడుతుంది.

– కిరణ్‌కుమార్, ఎస్సై, గజపతినగరం

అస్తవ్యస్తం..

నియోజకవర్గ కేంద్రంలో రోడ్డుపైనే వాహనాలు పార్క్ చేయడంతో పాటు చిరు వ్యాపారులు రోడ్డు మీదే దుకాణాలు ఏర్పాటు చేస్తుండడంతో ఉదయం, సాయంత్రం రహదారులు అస్తవ్యస్తంగా మారుతున్నాయి. రోడ్డు మీద రాకపోకలు సాగించాలంటేనే భయంగా ఉంది.

– ఆల్తి రామునాయుడు, స్థానికుడు, గజపతినగరం

అవగాహన కల్పిస్తున్నాం..

నియోజకవర్గ కేంద్రంలోని పురిటిపెంట, గజపతినగరం రెండు పంచాయతీలలో కాలువలపై నిర్మాణాలు చేపట్టడం వాస్తవమే. అల్పాహార దుకాణాలు, తోపుడు బండ్ల నిర్వహణ అస్తవ్యస్తంగా ఉండడంతో రాకపోకలకు ఇబ్బంది కలుగుతోంది. ఆక్రమణలు చేపట్టకూడదంటూ ఎప్పటికప్పుడు అవగాహన కల్పిస్తున్నాం. పోలీసులు, రెవెన్యూ అధికారుల సాయంతో పరిస్థితిని చక్కదిద్దేందుకు కృషి చేస్తున్నాం.

– జనార్దనరావు, ఈఓ, గజపతినగరం పంచాయతీ

ప్రజాసమస్యల పరిష్కారంపై దృష్టి సారించండి



వాల్‌పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే లోకం నాగమాధవి

డెంకాడ: ప్రజాసమస్యల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారించాలని నెల్లిమర్ల ఎమ్మెల్యే లోకం నాగమాధవి సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ బంటుపల్లి వాసుదేవరావు అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం ఆదివారం నిర్వహించారు. వైద్య, ఆరోగ్య, విద్యుత్, విద్య తదితర శాఖల అధికారులు హాజరై తమ శాఖల పరిధిలో జరుగుతున్న అభివృద్ధి పనుల వివరాలతో పాటు జరిగిన పనుల ప్రగతి నివేదికలు చదివి వినిపించారు. డెంకాడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యురాలు అనూష మాట్లాడుతూ ఈ నెల 12వ తేదీన డీవార్మింగ్ డే(జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం) నిర్వహించి, ఏడాది వయసు నుంచి 19 ఏళ్ల లోపు వారందరికీ నులిపురుగు నివారణ మాత్రలు(ఆల్బెండజోల్) వేయనున్నామని, ఆ దిశగా ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. కొన్ని గ్రామాల్లో నెలకొంటున్న విద్యుత్ కోతలపై పలువురు సభ్యులు సమావేశం దృష్టికి తీసుకురాగా ఎమ్మెల్యే స్పందించి..విద్యుత్ సమస్యలను పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అలాగే ప్రతి గ్రామంలో నెలకొన్న ప్రజాసమస్యలను తక్షణమే పరిష్కారమయ్యేలా చూడాలన్నారు. అనంతరం డీవార్మింగ్ డే వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. సమావేశంలో వైస్ ఎంపీపీ పిన్నింటి తమ్మునాయుడు, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.